# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 20-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **నూతన సమ్మిళిత ఆవిష్కరణలకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ వేదికగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **యువతలో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఆవిష్కరణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.**
3. **ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ఈరోజు నామినేషన్ ను దాఖలు చేశారు.**
4. **రైతులు ఉద్యానపంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**
5. **ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకునేలా త్వరలోనే స్మార్ట్ కార్డులు జారీ చేస్తామని ఏపీఎస్ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు.**

==========================

నూతన సమ్మిళిత ఆవిష్కరణలకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ వేదికగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఏర్పాటు చేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ పారిశ్రామికాభివృద్ధిలో రతన్ టాటా ముఖ్యపాత్ర పోషించారన్నారు. రతన్ టాటా ఆశయాలను కొనసాగించే లక్ష్యంతో ఇన్నోవేషన్ హబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

వాయిస్…27 సెకన్లు

--------------------------

యువతలో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఆవిష్కరణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కేంద్రాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, వినూత్న ఆలోచనలతో ముందుకు వచ్చే యువతకు, ప్రభుత్వం పరిశ్రమల సహకారంతో పాటు ఈ కేంద్రం ద్వారా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు పారిశ్రామిక ప్రగతి సాదించనున్నాయని మంత్రి పేర్కొన్నారు.

--------------------------

ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ఈరోజు నామినేషన్‌ను దాఖలు చేశారు. ఢిల్లీలో రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు అందజేశారు. నామినేషన్ పత్రాలపై ఎన్డీయే నాయకులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లతో పలువురు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. నామినేషన్‌కు రేపు చివరి తేదీ కాగా.. ఎల్లుండి నామినేషన్‌లను పరిశీలించనున్నారు. ఉపసంహరణకు ఈ నెల 25వ తేదీని గడువుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగనుంది.

---------------------------

రైతులు ఉద్యానపంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండ మార్కెట్ యార్డులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళాను మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతులకు పంటల సాగులో మెళకువలు తెలియజేసేందుకు ఇటువంటి కిసాన్ మేళాలు ఉపయోగపడతాయని చెప్పారు. ఉద్యానపంటల్లో అధునాతన వ్యవసాయ పద్ధతులను అవలంబించటం ద్వారా అధికదిగుబడులు సాధించవచ్చని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..32 సెకన్లు

---------------------------

ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకునేలా త్వరలోనే క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులు జారీ చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర ఆర్టీసీ డిపోను ఆయన నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా ద్వారక తిరుమలరావు మాట్లాడుతూ, త్వరలో రాష్ట్రానికి మరో వెయ్యి కొత్త ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయన్నారు. ఆధార్, ఓటర్, పాన్ కార్డుల జిరాక్స్ పత్రాలు కూడా చూపించి మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేయొచ్చని ఆయన తెలియజేస్తూ,

వాయిస్..27 సెకన్లు

---------------------------

శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి 4 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరడంతో అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పది స్పిల్ వే గేట్లను 14 అడుగులు ఎత్తి 3 లక్షల 45 వేల 730 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ గట్టుల విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తికి నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలంలో ప్రస్తుతం నీటి మట్టం 882.10 అడుగులకు చేరగా, నీటి నిల్వ 199.73 టీఎంసీలుగా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. మరోవైపు ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. 70 69 గేట్ల ద్వారా 4.65 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ప్రస్తుత 2025-26 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి సంబంధించి అభ్యర్థులు కళాశాలల ఐచ్ఛికాలు నమోదు చేసుకోవచ్చని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి సూచించారు. విజయవాడలో ఆమె ఈ రోజు

మాట్లాడుతూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు త్రాగునీరు అందిస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ అన్నారు. శ్రీకాకుళంలో ఈరోజు నిర్వహించిన “ఛాయ్ పే చర్చ” కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న సహజ వనరుల వినియోగించడం ద్వారా ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. శ్రీకాకుళంజిల్లాలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పారు.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు లాభాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 255 పాయింట్ల లాభంతో 81 వేల 900 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 77 పాయింట్ల లాభంతో 25 వేల 57 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం ఆగ్నేయ మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాలపై విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

=====================